సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 18 । అక్టోబర్ । 2023



రూ.17.58 లక్షలు పట్టివేత

జిల్లాలోని పలుచోట్ల ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.17.58 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 10లో



ఆన్‌లైన్ చెల్లింపులకు ప్రాధాన్యం

ఆన్‌లైన్‌లోనే విద్యుత్ బిల్లులు చెల్లించేలా వినియోగదారులకు అధికారులు పోస్టర్ల ద్వారా ప్రచారం చేస్తున్నారు. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
33° / 23°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఎండ ప్రభావం అధికంగానే ఉంటుంది. రాత్రి వాతావరణం కొంత చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదు ఇస్తున్న ఏఈఓ శ్రవణ్‌కుమార్

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏపీకి చెందిన భక్తులు మంగళవారం విరాళం అందజేశారు. కృష్ణా జిల్లా కంకిపాడుకు చెందిన పి.కోటేశ్వరరావు దంపతులు రూ.1,00,116ను ఆలయ అధికారులకు విరాళంగా ఇవ్వగా వారు రశీదు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ శ్రవణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ సాయిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ గిరిజన మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ శిక్షణ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17 ఏళ్లు నిండి ఇంటర్ ఉత్తీర్ణులైన అవివాహిత, వితంతు, ఒంటరి మహిళలు అర్హులని, ది కమిషనర్ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్, తెలంగాణ హైదరాబాద్ పేరున ఏదైనా బ్యాంక్ నుంచి రూ.200 డీడీ తీయాలని, దరఖాస్తుకు ధ్రువపత్రాలు జతచేసి ఈ నెల 20, 21 తేదీల్లో శిక్షణ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు శిక్షణ కేంద్రంలోని ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

పర్ణశాల వాసికి డాక్టరేట్



రాంమోహన్‌రావు

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల గ్రామానికి చెందిన ముక్కెర రాంమోహన్‌రావుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. ఓయూ అర్థశాస్త్ర విభాగం ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో ఆయన వరంగల్ జిల్లాలోని మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)పై సమర్పించిన పరిశోధనా పత్రానికి గాను డాక్టరేట్ ప్రకటించారు. ప్రస్తుతం కరీంనగర్ జిల్లా జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయనను మంగళవారం గ్రామస్తులు అభినందించారు.

కేటీపీఎస్ ఐదో దశలో నిలిచిన ఉత్పత్తి

పాల్వంచ: మండలంలోని కేటీపీఎస్ ఐదో దశ కర్మాగారంలో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. సోమవారం రాత్రి 11గంటలకు ఐదో దశలోని 250 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 10వ యూనిట్‌లో హీటర్ సమస్య తలెత్తడంతో ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. దీంతో ఇన్‌చార్జ్ సీఈ వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన మరమ్మతులు చేపట్టగా, బుధవారం మధ్యాహ్నం నాటికి ఉత్పత్తికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

జాతీయస్థాయిలో రెండు రజత పతకాలు



దీక్షిత్

కొత్తగూడెంటౌన్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ మైదానంలో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు జరిగిన సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో కొత్తగూడేనికి చెందిన జురుపుల దీక్షిత్ రజత పతకం సాధించాడు. ఈ సందర్భంగా దీక్షిత్‌ను మంగళవారం ద్రోణాచార్య అవార్డు గ్రహీత, అంతర్జాతీయ కోచ్ నాగపూరి రమేష్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 15, 17 తేదీల్లో వరుసగా రెండు పతకాలు సాధించడం హర్షణీయమన్నారు. తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ సారంగపాణి, జిల్లా అథ్లెటిక్స్ సెక్రటరీ మహీధర్, కోచ్ మల్లికార్జున్‌రావు, సుష్మాబాయ్, కె.మాన్విత తదితరులు కూడా దీక్షిత్‌ను అభినందించారు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

సుజాతనగర్: రాష్ట్ర వ్యాప్తంగా పలు ఇంజనీరింగ్ విభాగాల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో బుధ, గురు, శుక్రవారాల్లో నిర్వహించే పరీక్షల కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సీబీఆర్‌టీ(కంప్యూటర్ ఆధారిత) విధానంలో ఈ పరీక్షలు జరగనున్నాయి. బుధవారం నాటి పరీక్షకు 136 మంది అభ్యర్థులు హాజరవుతారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష ఉంటుందని, 1 నుంచి 2 గంటల మధ్య అభ్యర్థులను లోపలికి అనుమతిస్తామని వివరించారు.

భద్రాద్రిలో ఆ సేవలు అందని ద్రాక్షే!

ఏజెన్సీలో అరకొర వైద్యంతోనే సరి

- సూపర్ స్పెషాలిటీ సేవలపై పట్టింపే లేదు
- పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని ప్రభుత్వ ఆస్పత్రి
- ఆపదలో ఉన్నవారికి తప్పని ఇక్కట్లు



భద్రాచలం ఏరియా ఆస్పత్రి

ఏరియా ఆస్పత్రిలో మొత్తం పోస్టులు	207
ప్రస్తుతం పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది	133
వివిధ విభాగాల్లో ఖాళీల సంఖ్య	74

గోదావరి తీర ప్రాంత ఏజెన్సీలో ఇటు ప్రభుత్వ, అటు ప్రైవేటు వైద్య సేవలు అరకొరగానే అందుబాటులో ఉన్నాయి. నాలుగు రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న భద్రాచలంలో సూపర్ స్పెషాలిటీ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తేవడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి. సకాలంలో వైద్య సేవలు అందక మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి అకాల మరణం వైద్యపరంగా ఇక్కడి దీన స్థితికి అద్దం పడుతోంది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

నాటు వైద్యమే దిక్కు..

1998లో భద్రాచలంలో 100 పడకల సామర్థ్యంతో ఏరియా ఆస్పత్రి ప్రారంభమైంది. నాటి నుంచి ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయనే భరోసా కలిగింది. అప్పటి వరకు ఆర్‌ఎంపీలు, నాటు వైద్యంపై ఆధారపడిన ప్రజలు క్రమంగా ప్రభుత్వ ఆస్పత్రికి రావడం మొదలుపెట్టారు. ముఖ్యంగా చుట్టుపక్కల గిరిజనులకు ఈ ఆస్పత్రి పెద్ద దిక్కుగా మారింది. ఆ తర్వాత క్రమంలో ప్రైవేటు రంగంలోనూ వైద్య సేవలు మెరుగయ్యాయి. అయితే ప్రస్తుతం మారుతున్న పరిస్థితులకు తగ్గట్టుగా ఇటు ప్రభుత్వ, అటు ప్రైవేటు రంగంలో వైద్య సేవల్లో మార్పులు చోటు చేసుకోలేదు.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..

రెండు రోజుల క్రితం మరణించిన కుంజా సత్యవతి ఎమ్మెల్యేగా ఉన్న కాలంలోనే 100 పడకల ఆస్పత్రిని 200 పడకల సామర్థ్యంతో పాటు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. ఆమె పదవీ కాలం ముగిసిపోయే సమయంలో 200 పడకలకు మంజూరు లభించింది. ఆ తర్వాత ఆస్పత్రి విస్తరణ జరిగింది. కానీ గడిచిన తొమ్మిదేళ్లుగా సూపర్ స్పెషాలిటీ సేవల విషయంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. కొత్త విభాగాల్లో ఈ సేవలు అందుబాటులోకి రావడం సంగతి పక్కన పెడితే ఇప్పటికే మంజూరైన విభాగాలు ఎందుకూ కొరగాకుండా పోయాయి. క్షేత్ర స్థాయిలో ఎమ్మెల్యే మొదలు వైద్యశాఖ మంత్రులు, సీఎం వరకు, కేంద్ర స్థాయిలో ఎంపీలు, ప్రధాని వరకు ఎవరూ ఏజెన్సీ ప్రాంత వైద్య సమస్యలపై దృష్టి పెట్టడం లేదు.

వేధిస్తున్న సిబ్బంది కొరత..

భద్రాచలం ఆస్పత్రిలో గైనకాలజీ విభాగం నిరుపయోగంగా మారింది. ఎనిమిది మంది వైద్య సిబ్బందితో ఈ విభాగాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఒక్కరు కూడా ఇక్కడ పని చేయడం లేదు. ఒకరో, ఇద్దరో విధుల్లో చేరుతున్నా.. స్థానికంగా ఉండే పని ఒత్తిడి భారంతో ఏడాది తిరిగే లోపే ఇక్కడి నుంచి వెళ్లిపోతున్నారు. అనస్తీషియా విభాగానిదీ ఇదే పరిస్థితి. ఆరుగురు సిబ్బంది ఇక్కడ పని చేయాల్సి ఉండగా ప్రస్తుతం ఒక్కరు కూడా లేరు. వాస్తవానికి భద్రాచలంలో ఎప్పటి నుంచో ట్రామాకేర్, యూరాలజీ, న్యూరాలజీ విభాగంలో సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి తేవాలనే డిమాండ్ ఉంది. కొత్తగా ఈ ప్రాంతంలో గుండె సంబంధిత బాధితుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఈ విభాగంలోనూ సూపర్ స్పెషాలిటీ సేవలు కావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సాకులతో సరి

రాష్ట్ర విభజన తర్వాత భద్రాలచంలో స్థలం దొరకడం లేదనే సాకుతో ఇక్కడ అభివృద్ధి పనులను చాన్నాళ్లుగా అటకెక్కించిదనే అపవాదు రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. మరోవైపు నాలుగు రాష్ట్రాల సరిహద్దులో ఏజెన్సీ ప్రాంతానికి పెద్ద దిక్కుగా ఉన్న భద్రాచలంపై కేంద్రం కూడా నిర్లక్ష్య పూరిత వైఖరితో వ్యవహరిస్తోందనే ఆరోపణలూ ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులుగా గవర్నర్లు, రాష్ట్రపతి, కేంద్రమంత్రులు ఇక్కడ పర్యటనలు చేయడం తప్పితే స్థానికుల కష్టాలను శాశ్వతంగా తొలగించేందుకు ప్రణాళికాబద్ధంగా చేస్తున్న కృషి శూన్యమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఖమ్మం లేదంటే హైదరాబాద్..

స్థానికంగా అందరికీ సుపరిచితుడైన రాజకీయ నాయకుడు, డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆరు నెలల క్రితం గుండె సంబంధిత వ్యాధి బారిన పడ్డారు. స్వతహాగా ఆయన డాక్టర్ కావడంతో వెంటనే అప్రమత్తమై అత్యవసర వైద్య సేవలు పొంది ప్రాణాలు దక్కించుకున్నారు. కానీ మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి సకాలంలో వైద్య సేవలు అందక మృతిచెందారు. భద్రాచలమే కాదు జిల్లా కేంద్రం కొత్తగూడెంలోనూ వైద్య సేవలు అంతంతగానే ఉన్నాయి. అత్యవసర, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు పొందాలంటే కనీసం 120 కి.మీ దూరంలో ఉన్న ఖమ్మం వెళ్లాల్సిందే. రాజధానికి చేరుకోవాలంటే 300 కి.మీ. ప్రయాణించాల్సిందే. ఈ దూరం కేవలం భద్రాచలం నుంచే.. ఇక తెలంగాణ, ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లోని గిరిజనులు అత్యవసర వైద్య సేవలు పొందడమనేది గగన కుసుమమనే చెప్పాలి.

ఎన్నికలకు ఏర్పాట్లు సిద్ధం

- పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై దృష్టి
- సరిహద్దులో శాశ్వత చెక్‌పోస్టు ఏర్పాటుకు ఆదేశం
- కలెక్టర్ ప్రియాంక ఆల



సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

అశ్వారావుపేటరూరల్: త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు యంత్రాంగాన్ని సిద్ధం చేశామని, అనేక పోలింగ్ కేంద్రాల్లో ఇప్పటికే సదుపాయాలను కల్పించామని, నోటిఫికేషన్ నాటికి మిగిలిన కేంద్రాల్లో కూడా కల్పించేలా చర్యలు చేపడతామని కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టుల ద్వారా ఇప్పటివరకు రూ.34 లక్షలు సీజ్ చేశామని వెల్లడించారు. ఆ నగదుకు సంబంధించిన ఆధారాలను జిల్లా కేంద్రంలోని గ్రీవెన్స్ కమిటీకి ప్రతీరోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య చూపిస్తే తిరిగి అప్పగిస్తామని తెలిపారు. అంతకుముందు స్థానిక జెడ్పీఎస్‌ఎస్ బాలుర, బాలికల, మైనారిటీ గురుకుల పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను, అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును కలెక్టర్ సందర్శించారు. బాలికల పాఠశాల కేంద్రంలో సరైన సౌకర్యాలు లేకపోవడాన్ని గమనించి ఎంఈఓ కృష్ణయ్య, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మన ఊరు–మన బడి' కింద నిర్మిస్తున్న భవనాలు అసంపూర్తిగా ఉండడంపై నివేదిక ఇవ్వాలని ఎంఈఓను ఆదేశించారు. తప్పుడు నివేదికలు ఇచ్చిన ఎంఈఓ, హెచ్‌ఎం వేతనాన్ని నిలిపేయాలని అధికారులకు సూచించారు. అనంతరం తాత్కాలిక చెక్‌పోస్టును పరిశీలించి శాశ్వతంగా నిర్మించేలా స్థలాన్ని గుర్తించాలని తహసీల్దార్ కృష్ణప్రసాద్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పర్సా రాంబాబు, జిల్లా ఉద్యాన అధికారి మరియన్న, నోడల్ అధికారి వెంకటేష్ పాల్గొన్నారు.

నవంబర్ నాటికి తాగునీరు సరఫరా చేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): నవంబర్ చివరి నాటికి పాల్వంచ పట్టణ పరిధిలో అందరికీ తాగునీరు సరఫరా చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం పబ్లిక్‌హెల్త్, మున్సిపల్, మిషన్ భగీరథ అధికారులతో తాగునీటి సమస్యపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పనుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో మిషన్ భగీరథ పనులను సమీక్షించారు. పైప్‌లైన్, ట్యాంకులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ట్యాపింగ్ పాయింట్ల ద్వారా పూర్తిస్థాయిలో నీటిసరఫరా చేయాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. సమావేశంలో పాల్వంచ మున్సిపల్ కమిషనర్ ఎ స్వామి, మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ నళిని, ఇంట్రా ఈఈ తిరుమలేష్, మున్సిపల్ డీఈ మురళి, పబ్లిక్ హెల్త్ డీఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనుమతి తర్వాతే ప్రచార సామగ్రి ముద్రించాలి

ఎంసీఎంసీ నోడల్ అధికారి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అనుమతి పొందిన తర్వాతే ఎన్నికల ప్రచార సామగ్రిని ముద్రించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి, ఎంసీఎంసీ నోడల్ అధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. కలెక్టరేట్‌లోని మీడియా కేంద్రంలో మంగళవారం ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముద్రణ విషయంలో ఈసీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్నికల ప్రచార కరపత్రాలు, పోస్టర్ల ముద్రణకు భారత ఎన్నికల సంఘం నిబంధన సెక్షన్ 127 ప్రజాప్రతినిధుల చట్టం ప్రకారం అనుమతి తీసుకోవాలని, ప్రచురణకు ఇద్దరు వ్యక్తుల డిక్లరేషన్ ఇవ్వాలని సూచించారు. ముద్రణ సంస్థ పేరు, సెల్ నంబర్, ముద్రించిన కాపీల సంఖ్య, ప్రచురణకర్త పేరు తెలియజేయాలన్నారు. అనుమతి లేని ముద్రణలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ప్రచార ముద్రణల్లో వివాదాస్పద వ్యాఖ్యలు, ఇతరులను కించపరిచే అంశాలు, కుల, మత ప్రస్థావన వంటివి ఉండరాదన్నారు. ముద్రణలో క్లెయిమ్ కోసం బిల్లులు సాధారణ పేపర్‌పై కాకుండా సంస్థ బిల్‌పైనే ఇవ్వాలని, రూ. 20 వేలు దాటితే ఎన్నికల కోసం ప్రత్యేకంగా ప్రారంభించిన బ్యాంకు ఖాతా నుంచి మాత్రమే అభ్యర్థులు చెల్లించాలని అన్నారు. నిబంధనలు పాటించని వారికి రూ.2 వేలు జరిమానా, 6 నెలలు జైలు శిక్ష అమలు చేస్తారని వివరించారు. అనంతరం వ్యయ నియంత్రణ, జిల్లా సహకార అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రింటర్లు పాటించాల్సిన నియమాలను తెలియజేశారు.

'మెచ్చ'ని గులాబీ శ్రేణులు!

ఎమ్మెల్యేకు దూరమవుతున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు



అశ్వారావుపేట: అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును బీఆర్‌ఎస్ కేడర్ మెచ్చడం లేదని ఆ పార్టీలోనే ప్రచారం జరుగుతోంది. మహాకూటమి నుంచి టీడీపీ అభ్యర్థిగా గెలిచిన మెచ్చా.. బీఆర్‌ఎస్‌లో చేరినప్పటి నుంచి ఆ పార్టీ కేడర్‌ను ఆయన సరిగా పట్టించుకోవడం లేదనే అపవాదు మూటగట్టుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ కేడర్, నాయకుల కష్టాలు, ఇబ్బందులను గుర్తించకుండా ఓ సమీప బంధువు, ఓ అనుచరుడు షాడో ఎమ్మెల్యేలుగా వ్యవహరిస్తూ ఎమ్మెల్యేకు తెలియకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తికి కారణమని తెలుస్తోంది. వచ్చే నెలలో జరగబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా తిరిగి మెచ్చా నాగేశ్వరరావుకే బీ ఫామ్ ఇచ్చినా ఇప్పటి వరకు ఆయన ఎన్నికల మూడ్‌లోకి రాలేదని, మండలాల వారీగా నాయకులు, కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించలేదని అంటున్నారు. అసలు ఎన్నికలకు ఆయన సంసిద్ధంగా ఉన్నారా.. లేరా అనే అనుమానాలను సైతం కొందరు కార్యకర్తలు వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కో చోట.. ఒక్కో గోల..

అశ్వారావుపేట మండలంలో పార్టీ మారుతామని బెదిరించిన సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులకు ఎమ్మెల్యే మెచ్చా ప్రభుత్వ పథకాలు మంజూరు చేసి చులకనయ్యారని ఆ పార్టీ వారే చెబుతున్నారు. ఎమ్మెల్యేను బెదిరిస్తేనే పథకాలు మంజూరు చేస్తారా అని ప్రశ్నిస్తున్నారు. ఓ వైపు దళితబంధు మంజూరు కాకపోవడంతో ఇప్పటికే ఆ పథకం పట్ల ఆశలు పెట్టుకున్న అర్హులైన కార్యకర్తలు బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాకుంటే తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తుందని, అప్పుడు పథకం వర్తింపజేస్తామని కొందరు స్థానిక నాయకులు వారిని బుజ్జగిస్తున్నారని సమాచారం. ఇక ములకలపల్లి మండలంలో పార్టీలోని రెండు వర్గాలు వేర్వేరుగా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ పంచాయితీ కొలిక్కి రాకుంటే ఒక వర్గం పార్టీకి ఝలక్ ఇచ్చే అవకాశాలున్నా.. ఎమ్మెల్యే ఆ సమస్యను పట్టించుకోకుండా గాలికొదిలేయడంతో అక్కడి శ్రేణులు సైతం గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల వేళ కూడా పార్టీ కేడర్‌ను ప్రసన్నం చేసుకునేందుకు ఎమ్మెల్యే చొరవ చూపడం లేదని కొందరు సీనియర్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపక్షాల కుట్రలను ప్రజలు నమ్మరు

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు



మాట్లాడుతున్న వద్దిరాజు రవిచంద్ర, పక్కన ఎమ్మెల్యే వనమా

పాల్వంచ : దేశాన్ని, రాష్ట్రాన్ని 50 ఏళ్ల పాటు పాలించినా పేదలకు ఏమీ చేయని కాంగ్రెస్ ఇప్పుడు అనేక పథకాల పేరుతో ముందుకొస్తోందని, ప్రతిపక్షాల కుట్రలను ప్రజలు నమ్మరని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. మంగళవారం స్థానిక పాత పాల్వంచలో వనమా నివాసంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వనమా చేతిలో నాడు ఓడిపోయిన జలగం వెంకట్రావ్ నేడు ఢిల్లీ, హైదరాబాద్‌లో కోర్టు చుట్టూ తిరిగి ఏదో సాధించానని గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. ఆయనకు బీఆర్‌ఎస్ నుంచి మళ్లీ టికెట్ వస్తుందని పగటి కలలు కన్నారని, వాటిని సీఎం కేసీఆర్ వమ్ము చేశారని చెప్పారు. బీసీల పట్ల కేసీఆర్‌కు ఉండబట్టే ఎమ్మెల్యే వనమాకు మరోసారి టికెట్ ఇచ్చారని గుర్తు చేశారు. వచ్చే నెల 5న జరిగే బీఆర్‌ఎస్ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ ఎ.దామోదర్, నాయకులు పురుషోత్తం, కొత్వాల శ్రీనివాసరావు, రాంబాబు, వాసుదేవరావు, కాసుల వెంకట్, జేవీఎస్ చౌదరి, రాజుగౌడ్, హనుమంతరావు, రజాక్, బత్తుల వీరయ్య, సోమిరెడ్డి పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ

గజలక్ష్మిగా జగన్మాత

భద్రాద్రి రామాలయంలో ప్రత్యేక పూజలు



గజలక్ష్మి అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు

భద్రాచలం : చెదరని అధికారం, తరగని సంపదను ప్రసాదించే గజలక్ష్మిగా జగన్మాత శ్రీ మహాలక్ష్మి భక్తులకు మంగళవారం దర్శనమిచ్చారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో మూడో రోజున శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారిని గజలక్ష్మి రూపంలో అలంకరించారు. అమ్మవారి ఉపాలయంలో అర్చకులు స్నపన తిరుమంజనం, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో మహిళా భక్తులు భారీగా హాజరయ్యారు. కాగా, చిత్రకూట మండపంలో శ్రీరామాయణ పారాయణోత్సవాల్లో భాగంగా వేద పండితులు, అర్చకులు అయోధ్యకాండ పారాయణం చేశారు.

నేటి ధనలక్ష్మి అలంకార విశిష్టత..

'హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణ రజతస్రజాం..' అంటూ శ్రీ సూక్తం అమ్మవారిని ధనలక్ష్మిగా కీర్తిస్తుంది. ధనం అంటే కేవలం డబ్బు మాత్రమే కాదు.. విద్య, బలం, కీర్తి మొదలైనదంతా ధనమేనని చెబుతారు. విద్యాధనం, హిరణ్య ధనం, శక్తి ధనాలను ప్రసాదిస్తుంది కాబట్టే ఈ అమ్మకు ధనలక్ష్మిగా పేరని, ముగ్గురమ్మల శక్తిని భక్తులకు పంచుతుందని పండితులు తెలుపుతున్నారు.

నేత్రపర్వం.. రామయ్య నిత్యకల్యాణం

స్వామి వారికి బేడా మండపంలో నిత్యకల్యాణ వేడుక కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

అన్నపూర్ణాదేవిగా పెద్దమ్మతల్లి



అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు

పాల్వంచరూరల్ : శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం పెద్దమ్మతల్లి అమ్మవారు శ్రీ కాశీ అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు అర్చకులు, రుత్విక్‌లు ప్రాతః కాలార్చన, శ్రీ లక్ష్మీ గణపతి అనుష్టానం, వేద పారాయణం, నవగ్రహ జపాలు, శ్రీ సూక్తం, మన్యసూక్త పారాయణం, సప్తశతి పారాయణం, శ్రీచక్రార్చన, రుద్రాభిషేకం, రుద్రహోమం, చండీహోమం, లక్ష కుంకుమార్చన, అభయాంజనేయస్వామికి పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ ఎస్.రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగించాలి



ల్యాబ్‌లో రికార్డులు పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

కరకగూడెం : వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు నిరంతరం గ్రామాల్లో పర్యటిస్తూ వ్యాధుల బారిన పడిన వారు పీహెచ్‌సీకి వచ్చేలా చూడాలని, ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగించాలని జిల్లా సహాయ మలేరియా అధికారి గొంది వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక పీహెచ్‌సీలో ల్యాబ్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఐసీఎంఆర్ టీం కరకగూడెం రానుందని, మలేరియా ప్రభావిత గ్రామాలకు వారిని తీసుకెళ్తే ప్రయోజనం ఉంటుందని అన్నారు. ఆర్‌ఎంపీ క్లినిక్‌లను సందర్శించి జ్వరపీడితులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని, పరిమితికి మించి వైద్యం చేయొద్దని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గాభవాని, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుడితో కారు కడిగించిన ఏఈ



ఏఈ కారును కడుగుతున్న ఆర్టిజన్ కార్మికుడు

పాల్వంచ: కేటీపీఎస్ కర్మాగారంలో పనిచేసే ఆర్టిజన్ కార్మికులతో అధికారులు వెట్టిచాకిరీ చేయిస్తున్నట్లు అనేక ఆరోపణలు వస్తున్నాయి. మంగళవారం కేటీపీఎస్ ఐదో దశ కర్మాగారం కోల్ ప్లాంట్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులతో అక్కడ పనిచేసే ఓ ఏఈ సొంత పనులు చేయిస్తుండటం పలు విమర్శలకు దారి తీసింది. ఏఈ తన కారును కార్మికుడితో కడిగించుకున్నాడని, అంతేకాకుండా రోజూ అతడితో ఇంటి పనులు సైతం చేయించుకుంటున్నాడని పలువురు చెబుతున్నారు.

గోదావరి బ్రిడ్జిపై ట్రాఫిక్ జామ్

గంట పాటు నిలిచిన వాహనాలు



బ్రిడ్జిపై ఆగిన వాహనాలు

బూర్గంపాడు: సారపాక – భద్రాచలం మధ్య గోదావరి బ్రిడ్జిపై మంగళవారం ఆర్టీసీ బస్సు టైర్ పంక్చర్ కావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. బ్రిడ్జి మధ్యలో బస్సు నిలిచిపోవడంతో భద్రాచలం, సారపాక ఇరువైపులా వందలాది వాహనాలు ఆగాయి. రెండు అంబులెన్స్‌లు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. దీంతో బూర్గంపాడు, భద్రాచలం పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

రాష్ట్ర హాకీ జట్టు కోచ్‌గా నిఖిల్



నిఖిల్

కొత్తగూడెంటౌన్: తమిళనాడులో ఈ నెల 17 నుంచి జాతీయస్థాయి సబ్‌జూనియర్స్ బాలుర హాకీ పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా తెలంగాణ జట్టు కోచ్‌గా కొత్తగూడెంనకు చెంది న సీనియర్ హాకీ క్రీడాకారుడు నిఖిల్‌కు అవకాశం దక్కింది. ఈ సందర్భంగా మంగళవారం ఉత్తర్వులు అందాయని హాకీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్ తెలిపారు. హాకీలో లెవెల్–1 పరీక్ష ఉత్తీర్ణత సాధించిన నిఖిల్ కోచ్‌గా ఎంపిక కావడంపై ప్రేమ్, కోచ్ ఇమామ్‌తో పాటు కృష్ణవేణి, సలీంఖాన్, రాజ్‌కుమార్, ఇమంది గణేశ్ అభినందించారు.

మావోయిస్టు సానుభూతి పరుల బైండోవర్

దుమ్ముగూడెం: లొంగిపోయిన మావోయిస్టుతో పాటు మరో ఐదుగురు మావోయిస్టు సానుభూతిపరులను మంగళవారం తహసీల్దార్ చంద్రశేఖర్ ఎదుట బైండోవర్ చేశారు. ఎన్నికల నేపథ్యంలో మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు గతంలో నేరాలకు పాల్పడినవారిని బైండోవర్ చేస్తున్నారు.

వృద్ధుడు అదృశ్యంపై కేసు

ఇల్లెందురూరల్: మండలంలోని మాణిక్యారం గ్రామానికి చెందిన రాజాలు అనే వృద్ధుడు కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు కొమరారం ఎస్‌ఐ గిరిధర్‌రెడ్డి తెలిపారు. గత నెల 30వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాజాలు తిరిగి రాలేదు. ఎక్కడ గాలించినా ఆచూకీ దొరక్కపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,231

ఆన్‌లైన్ చెల్లింపులకు ప్రాధాన్యం

- విద్యుత్ బిల్లుల వసూళ్లపై అధికారుల దృష్టి
- వినియోగదారుల్లో అవగాహన పెంచేలా చర్యలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ బిల్లుల చెల్లింపును సులభతరం చేస్తూ తీసుకొచ్చిన ఆన్‌లైన్ విధానంపై వినియోగదారులకు అవగాహన కల్పించేలా అధికారులు దృష్టి సారించారు. బిల్లుల చెల్లింపు కోసం శాఖ రెవెన్యూ విభాగం ప్రత్యేక కౌంటర్లు నిర్వహిస్తుండగా.. సాంకేతిక పరిజ్ఞానం పెరగటంతో అన్ని బిల్లులతో పాటే విద్యుత్ బిల్లులను కూడా ఆన్‌లైన్‌లో చెల్లించే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది. దీంతో 2013లో విద్యుత్ శాఖ ఈ విధానాన్ని ప్రారంభించగా.. ఎన్పీడీసీఎల్ పరిధిలో ఇప్పటివరకు దాదాపు 13 లక్షల మంది డిజిటల్ విధానంలో ఆన్‌లైన్ చెల్లింపులు చేస్తున్నారు. అయితే, ఈ సంఖ్య మరింత పెంచేలా వినియోగదారుల్లో అవగాహన కల్పించేందుకు అధికారులు రంగంలోకి దిగారు.

పోస్టర్ల ద్వారా ప్రచారం

ఆన్‌లైన్‌లోనూ బిల్లులు చెల్లించొచ్చని.. తద్వారా వ్యయప్రయాసాలు తప్పుతాయనే అంశంపై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు విద్యుత్ శాఖ అధికారులు పోస్టర్లను రూపొందించారు. వీటిని మంగళవారం ఖమ్మం విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయంలో అధికారులు ఆవిష్కరించగా అన్ని రెవెన్యూ కార్యాలయాల వద్ద అంటించాలని నిర్ణయించారు. డిజిటల్ చెల్లింపుల విధానంలోనూ రశీదు పొందొచ్చని, గత బిల్లుల వివరాలు తెలుసుకోవడం, గడువు తేదీకి ముందు మెసేజ్ వచ్చేలా సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని చెబుతూ పోస్టర్లలో వివరాలు ముద్రించారు. ఈ సందర్భంగా ఖమ్మం విద్యుత్ శాఖ సర్కిల్ ఆపరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎ.సురేందర్ మాట్లాడుతూ టీఎస్ ఎన్పీడీసీఎల్ వెబ్‌సైట్ ద్వారానే యాప్ ద్వారా బిల్లులు చెల్లించొచ్చని తెలిపారు. సులభమైన ఈ విధానాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్కిల్ అకౌంట్స్ అధికారి శ్రీధర్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'తోడు' అధ్యక్షుడికి అవార్డు



మనోహర్‌ను సత్కరిస్తున్న ఫౌండేషన్ బాధ్యులు

వైరా: యువకులతో రక్తదానం చేయించిన వైరాకు చెందిన తోడు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు నందిగామ మనోహర్‌కు శ్రీనివాస రామానుజం ఫౌండేషన్ బాధ్యులు ఉత్తమ సేవా అవార్డు ప్రకటించారు. ఈ సందర్భంగా ఖమ్మంలో నిర్వహించిన సమావేశంలో ఆయనకు ఫౌండేషన్ అధ్యక్షుడు తుమ్మా అమరేష్‌తో పాటు కొమ్మిన్ని కిషోర్, మేడా మోహనరావు, నర్సింహారావు, దాసరి రమేష్ తదితరులు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి



రమేశ్ (ఫైల్)

దమ్మపేట: పామాయిల్ గెలలను కోస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని నల్లకుంట గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని రాచూరిపల్లి గ్రామ పంచాయతీలోని దిబ్బగూడెం గ్రామానికి చెందిన కూరం రమేశ్ (28) మంగళవారం నల్లకుంట శివారులోని పామాయిల్ తోటలో గెలలు కోసే పనికి వెళ్లాడు. చెట్లు చాలా ఎత్తులో ఉన్న కారణంగా పొడవాటి లోహపు పైపును ఉపయోగించి గెలలను కోస్తుండగా ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ లైను తగిలింది. విద్యుదాఘాతంతో రమేశ్ శరీరం కాలిపోవడంతో స్థానికులు వెంటనే దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఖమ్మం తరలించారు. హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో జూనియర్ లైన్‌మెన్‌కు గాయాలు

సుజాతనగర్: విద్యుదాఘాతంతో జూనియర్ లైన్‌మెన్‌కు గాయాలైన ఘటన నాయకులగూడెం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నాయకులగూడెం గ్రామానికి చెందిన చింతాల ప్రశాంత్.. ఎల్‌సీ తీసుకొని స్తంభం ఎక్కాడు. మరమ్మతులు చేస్తున్న క్రమంలో వీధి లైట్లు వేసే సిబ్బంది స్విచ్చాన్ చేయడంతో విద్యుత్ ప్రసారం జరిగి స్తంభం పైనుంచి ప్రశాంత్ కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు.

రూ.17.58 లక్షల నగదు పట్టివేత

కొత్తగూడెంటౌన్: ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.6,80,000 నగదును మంగళవారం కొత్తగూడెం టూటౌన్ పోలీసులు వాహన తనిఖీల్లో పట్టుకున్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు వాహనంలో తరలిస్తున్న నగదును గుర్తించారు. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పాల్వంచలో...

పాల్వంచ: కారులో నగదు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలోని కేఎస్పీరోడ్‌లో మున్సిపాలిటీ కార్యాలయం వెళ్లే మలుపు వద్ద పట్టణ ఎస్‌ఐ బి.రాము ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. శ్రీనివాసకాలనీకి చెందిన తంబూరు అజయ్‌కుమార్ కారులో రూ.5 లక్షల నగదు తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. నగదుకు సంబంధించిన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు.

భద్రాచలం చెక్‌పోస్టు వద్ద...

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీల్లో అనుమతి లేకుండా తరలిస్తున్న రూ.2.50 లక్షల నగదును మంగళవారం పట్టుకున్నారు. వాహనంలో విజయవాడకు తరలిస్తుండగా పట్టుకోగా ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశారు.

ముర్రేవాగు వద్ద తనిఖీల్లో...

కొత్తగూడెంరూరల్: ఎన్నికల నేపథ్యంలో పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీల్లో మంగళవారం రూ.2లక్షలు నగదు పట్టుబడింది. లక్ష్మీదేవిపల్లి మండలం ముర్రేడువాగు వద్ద మంగళవారం ఎస్‌లు పి.సంతోష్, రాజమౌళి వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో ఓ వాహనంలో రూ.2 లక్షలు తరలిస్తుండగా పట్టుకున్నారు. వాహనదారుడు ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్‌చేశారు.



కరకగూడెం: పట్టుబడిన నగదును చూపుతున్న పోలీసులు

కరకగూడెం మండలంలో..

కరకగూడెం: తాటిగూడెం గ్రామ సమీపంలో మంగళవారం ఎస్‌ఐ రాజారాం వాహన తనిఖీలు చేపట్టగా మండలంలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన చందా నర్సమ్మ ఆటోలో సుమారు రూ.1.28 లక్షలు తీసుకెళ్తూ పట్టబడింది. ఆధారాలు చూపకపోవడంతో పోలీసులు నగదును సీజ్ చేశారు.

చెక్‌పోస్టులను తనిఖీ చేసిన సీఐ

భద్రాచలంఅర్బన్: పట్టణంలో ఏర్పాటు చేసిన నాలుగు చెక్‌పోస్టులను సీఐ నాగరాజురెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనిఖీల్లో డబ్బు పట్టుబడితే తగిన ఆధారాలు చూపించి తీసుకెళ్లవచ్చని చెప్పారు. ప్రజలు తమ అవసరాల నిమిత్తం రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకెళ్లొద్దని, మద్యం, డబ్బుల పంపిణీని అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నామని ఆయన చెప్పారు. ఆయన వెంట భద్రాచలం ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

పెళ్లి పేరుతో మోసం చేస్తున్న మహిళల అరెస్ట్

చండ్రుగొండ: పెళ్లిళ్ల పేరుతో మోసం చేసి, రూ.లక్షలు గడిస్తున్న ఇద్దరు మహిళలను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ మాచినేని వివరాలు వెల్లడించారు. ఏపీ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా పెద్దపాడు మండలం తాళ్లముడి గ్రామానికి చెందిన లక్ష్మిశ్రావణికి 2020లో వివాహం కాగా చెడు వ్యసనాలకు బానిసైన భర్తను వదిలేసింది. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం తంగెళ్లబీడుకు చెందిన రేణుక మ్యారేజీ బ్యూరోతో పాటు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తోంది. వీరిద్దరూ కలిసి యువకులను పెళ్లి పేరుతో మోసం చేస్తూ డబ్బులు గుంజుతున్నారు. లక్ష్మిశ్రావణిని పెళ్లికాని యువతిలా చూపించి, తర్వాత బురిడీ కొట్టించి డబ్బులతో ఉడాయిస్తారు. గతంలో ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన ఓ యువకుడిని ఇదేవిధంగా మోసం చేసి రూ.3 లక్షలు తీసుకున్నారు. సత్తుపల్లి సమీపంలోని కొత్తూరుకు చెందిన మరో యువకుడి నుంచి రూ.2 లక్షలు కాజేశారు. చండ్రుగొండ మండలంలోని గానుగపాడు గ్రామానికి చెందిన యువకుడికి ఇదేవిధంగా వివాహం జరిపిస్తామని మధ్యవర్తితో రేణుక రూ.5 లక్షలకు మాట్లాడుకుంది. అందులో రూ.4 లక్షలు యువకుడి కుటుంబ సభ్యులు చెల్లించగా గత నెల 7వ తేదీన లక్ష్మిశ్రావణితో వివాహం జరిపించింది. కొన్నిరోజుల తర్వాత యువకుడి కుటుంబ సభ్యులతో గొడవ పడి పారిపోయారు. యువకుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఇద్దరు మహిళలను అదుపులో తీసుకుని విచారించగా ఈ మోసాలు వెలుగుచూశాయని ఎస్‌ఐ తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన చెప్పారు. కాగా, పెళ్లి సంబంధాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మ్యారేజీ బ్యూరో నిర్వాహకుల మాటలు నమ్మి మోసపోవద్దని ఎస్‌ఐ రవి సూచించారు.

ఇదే చివరి ప్రయాణం

- రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు మృతి
- ఉపాధి కోసం వలస వచ్చి కన్నుమూత

ఖమ్మంఅర్బన్: సొంత అన్నదమ్ములైన వారికి స్వస్థలంలో ఉపాధి లేక ఎన్నో ఆశలతో ఇక్కడకు వచ్చారు. రూపాయి, రూపాయి కూడబెట్టి కుటుంబానికి పంపిస్తూ పొట్ట పోసుకుంటున్నారు. పనిలో భాగంగానే వెళ్లి వస్తున్న వారిద్దరికి అదే చివరి ప్రయాణమైంది. మరో రోజును చూడకుండానే వారిద్దరు రోడ్డుప్రమాదంలో కన్నుమూశారు. ఖమ్మంలోని బల్లేపల్లి వద్ద ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదం వివరాలిలా ఉన్నాయి.

గ్లాస్ ఫిట్టింగ్ పనులు కోసం...

ఉత్తరప్రదేశ్‌రాష్ట్రంలోని మహారాజు గంజ్ జిల్లా కర్మహా గ్రామానికి చెందిన అన్నదమ్ములైన హీరాలాల్(30), జయరాజు(28) ఆరేళ్ల క్రితం ఖమ్మం వచ్చారు. పెద్ద భవనాలకు గ్లాస్ ఫిట్టింగ్ పనుల్లో నిష్ణాతులైనవారు ఇక్కడ పనిచేస్తున్నారు. వీరిద్దరు పని నిమిత్తం మణుగూరు వెళ్లి సోమవారం రాత్రి లేల్యాండ్ ట్రక్కులో ఖమ్మం బయల్దేరారు. మంగళవారం తెల్లవారుజామున ఖమ్మం శివారు బల్లేపల్లి వద్దకు చేరుకున్న వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో హీరాలాల్, జయరాజుకు తీవ్రగాయాలు అయి అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఖానాపురం హవేలీ ఎస్సై వెంకన్న చేరుకుని అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది సహకారంతో మృతదేహాలను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి వారి కుటుంబీకులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు. కాగా, పొట్టకూటి కోసం వచ్చి వలస వచ్చిన అన్నదమ్ములు ఒకే ప్రమాదంలో కన్నుమూయడం వారి కుటుంబంలో విషాదాన్ని నింపినట్లయింది.



ఘటనాస్థలంలో హీరాలాల్, జయరాజ్ మృతదేహాలు

విద్యుత్ చౌర్యం చేసిన ఏడుగురిపై కేసు

దుమ్ముగూడెం: మండలంలోని దబ్బనూతుల కొత్తూరు గ్రామంలో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఏడుగురు వ్యక్తులపై విద్యుత్ శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. మంగళవారం గ్రామంలో దుమ్ముగూడెం, భద్రాచలానికి చెందిన విద్యుత్‌శాఖ అధికారులు తనిఖీ చేపట్టగా విద్యుత్‌లైన్లకు తీగలు తగిలించిన వారి కనెక్షన్‌లు తొలగించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఏడుగురిపై కేసు నమోదు చేశామని ట్రాన్స్‌కో ఏఈ మోహన్‌రెడ్డి తెలిపారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

దమ్మపేట: వయోభారంతో పాటు పట్టించుకునే వారు లేక వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మందలపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వృద్ధుడు అడపా కొమురయ్య (85)కు భార్య, కుమారుడు కొంతకాలం కిందట మృతిచెందారు. కొమురయ్య ఆలనాపాలన చూసుకునే వారు ఎవరూ లేకపోవడంతో సోమవారం మందలపల్లి ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో పురుగులమందు తాగాడు. గమనించిన ఆర్టీసీ కంట్రోలర్ 108 ద్వారా సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందాడు. మృతుడి సోదరుడు అడపా వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు.


గంజాయి పట్టివేత



వివరాలు చెబుతున్న సీఐ నాగరాజురెడ్డి

భద్రాచలంఅర్బన్: కూనవరం రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద 4 కేజీల గంజాయిని ఎస్‌ఐ విజయలక్ష్మి మంగళవారం పట్టుకున్నారు. టౌన్ సీఐ నాగరాజురెడ్డి కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అక్బర్ ఆదేశానుసారం హైదరాబాద్‌కే చెందిన వైభవ్, ప్రజ్వల్ సీలేరులో 4 కేజీల గంజాయి కొనుగోలు చేసి ద్విచక్రవాహనంపై తరలిస్తూ భద్రాచలంలో పోలీసులకు పట్టుబడ్డారు. గంజాయిని హైదరాబాద్‌లో విక్రయించేందుకు తరలిస్తున్నట్లు తేలిందని, దాని విలువ రూ.1.35 లక్షలుంటుందని, నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ నాగరాజురెడ్డి తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా



ఈశ్వర్ (ఫైల్)

పాల్వంచరూరల్: ఈత కొట్టేందుకు వెళ్లి బాలుడు మృతిచెందిన ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. బస్వాతారకకాలనీ పంచాయతీ వీరునాయక్‌తండాకు చెందిన బానోతు భావ్‌సింగ్, పద్మ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు బానోతు ఈశ్వర్ (14)లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. సెలవులకు ఇంటికి వచ్చిన ఈశ్వర్.. స్నేహితులు చరణ్, ఆకాశ్‌తో కలిసి సోములగూడెం శివారులోని చెక్‌డ్యామ్‌వద్దకు ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో ఈశ్వర్ నీటిలో మునిగి చనిపోగా స్నేహితులు పారిపోయారు. ఎస్‌ఐ కార్తీక్ ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మృతికి కారణం విద్యుత్తా?

చేపల వేట కోసం నీటిలో అమర్చిన విద్యుత్ వైర్లే ఈశ్వర్ మృతికి కారణమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెక్‌డ్యామ్‌లో చేపలు పట్టేందుకు విద్యుత్ వైర్లు పెట్టి ఉంచిన సమయంలో ఈశ్వర్ డ్యామ్‌లో ఈతకు వెళ్లగా విద్యుదాఘాతంతో మృతి చెంది ఉంటాడని తల్లిదండ్రులు, బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్



మాట్లాడుతున్న అశోక్ కుమార్

ఇల్లెందు: ప్రభుత్వం విద్యారంగానికి బడ్జెట్‌లో కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. ఇల్లెందులో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి విద్యాసదస్సులో ఆయన మాట్లాడారు. అనేక పాఠశాలల్లో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నందున స్పందించాలన్నారు. అలాగే, తక్షణం ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. అంతేకాకుండా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కాగా, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చిన పార్టీకే తమ మద్దతు ఉంటుందని అశోక్ తెలిపారు. సదస్సులో జిల్లా అధ్యక్షుడు బి.రాజుతోపాటు పి.నాగిరెడ్డి, జి.హరిలాల్, జి.సమ్మ య్య, రామాచారి, వి.మనోహర్‌రాజు, ఎస్.పూర్ణచందర్‌రావు, పి.శ్రీనివాసరావు, జి.కిషన్, రాంబాబు, బి.ప్రసాద్‌రావు, సరియా, రాంచంద్, భాగ్యారావు, సరళ, బాలు, కృష్ణబాబు, విజయ్, స్వామిదాసు, గుమ్మడి సమ్మయ్య, ఇమ్మానియేల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమ్మెతో దిగొచ్చిన ప్రభుత్వం



మాట్లాడుతున్న జయలక్ష్మి

సింగరేణి(కొత్తగూడెం): సమ్మె ద్వారా బీఆర్‌ఎస్ ప్రభుత్వం దిగొచ్చేలా చేయగలిగామని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. కొత్తగూడెంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు.. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందించకపోవడంతో సమ్మెకు దిగాల్సి వచ్చిందని తెలిపారు. కాగా సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి జరిగిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో చర్చలు జరిపి ప్రమాద బీమా పెంచడమే కాక వేసవి సెలవులు ఇస్తామని, ప్రతినెల 14న వేతనాల చెల్లింపుతోపాటు పలు డిమాండ్లకు అంగీకరించిందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా సమ్మె ఒప్పందాలు అమలు చేయాల్సిందేనని జయలక్ష్మి స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు ఏజే రమేశ్, డి.వీరన్న, జిలకర పద్మ, వెంకటరమణ, జయశీల, వీరభద్రమ్మ, హేమలత, శకుంతల, రాధ, రాజ్యలక్ష్మి, కళావతి, సరస్వతి, ఈశ్వరి, ఫాతిమా, సారమ్మ పాల్గొన్నారు.

రేపు కేంద్ర మంత్రి పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

మధిర: కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి నారాయణస్వామి ఈనెల 19న మధిరలో పర్యటించనున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ తెలిపారు. మధిరలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం కార్యకర్తలు ఇప్పటి నుంచే కష్టపడాలని సూచించారు. కేంద్రప్రభుత్వ పథకాలను ఇంటింటికీ వివరిస్తే విజయం సాధించొచ్చని తెలిపారు. కాగా, 19వ తేదీన కేంద్ర మంత్రి నారాయణస్వామితో ఆంధ్రప్రదేశ్ సంఘటన్ ప్రధాన కార్యదర్శి మధుకర్ కూడా పాల్గొంటారని.. వీరికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలకాలని సత్యనారాయణ కోరారు. ఈ సమావేశంలో మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, నాయకులు పెరుమాళ్లపల్లి విజయరాజు, శ్యాం, చిలువేరు సాంబశివరావు, పాపట్ల రమేష్, కుంచం కృష్ణారావు, దేవరకొండ కోటేశ్వరరావు, తాళ్లూరి సురేష్, రామయోగేశ్వరరావు, బియ్యవరపు రామకృష్ణ, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో బతుకమ్మ



అమెరికాలో బతుకమ్మ ఆడుతున్న తెలంగాణ మహిళలు

భద్రాచలంటౌన్: భద్రాచలంలో ఇంజనీరింగ్ చేసిన విద్యార్థినులు అమెరికాలోని డెన్వర్ రాష్ట్రంలో బతుకమ్మ ఆటపాటలతో అలరించారు. పట్టణంలోని పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కళాశాలలో 2004లో ఇంజనీరింగ్ పూర్తిచేసి అమెరికాలో స్థిరపడిన యువతులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్లోబల్ తెలంగాణ ఆధ్వర్యంలో వేడుకలు సాగాయి. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐలు ప్రగతిరావు, సింధు, సునీత తదితరులు పాల్గొన్నారు.